# సాక్షి శ్రీకాకుళం


శుక్రవారం । 11 । అక్టోబర్ । 2024






## చిన్నారి మృతితో ఆందోళన

జిల్లా కేంద్రంలోని బొందిలీపురంలో ఏ-1 ఆస్పత్రిలో విషాద ఘటన చోటుచేసుకుంది. చికిత్స పొందుతున్న చిన్నారి మృతి చెందడంతో కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. - IIలో



## 'పవర్' లేని పండుగలు

ఈ నెల 14 నుంచి పల్లె పండుగలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే సర్పంచ్‌ల నిర్ణయాలను పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. - IIలో

## నేడు పోస్టాఫీసులో ఆధార్ సేవలు

శ్రీకాకుళం అర్బన్: తపాలా వారోత్సవాల సందర్భంగా శ్రీకాకుళంలోని ప్రధాన పోస్టాఫీసులో శుక్రవారం అందించనున్న ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రధాన తపాలాశాఖ అధికారి నూలు భానోజీరావు కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆధార్ అప్‌డేషన్, ఎన్‌రోల్‌మెంట్, ఇతర ఆధార్ సంబంధిత సేవలు అందుతాయని పేర్కొన్నారు. పోస్టాఫీసులో అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## న్యూస్‌రీల్

### అదనపు డీఎంహెచ్‌వోగా రమేష్‌బాబు

అరసవల్లి: జిల్లా అదనపు డీఎంహెచ్‌వో, లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ ఆఫీసర్‌గా డాక్టర్ బి.రమేష్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన చిత్తూరు జిల్లా నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా శ్రీకాకుళం వచ్చారు. ఇంతవరకు ఈ స్థానంలో నరసన్నపేటకు చెందిన డాక్టర్ తాడేల శ్రీకాంత్ ఇన్‌చార్జిగా విధుల్లో ఉన్నారు. టెక్కలి డిప్యూటి డీఎంహెచ్‌వోగా డాక్టర్ తాడేల శ్రీకాంత్ పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ స్థానంలో పనిచేసిన డాక్టర్ మల్లేశ్వరరావు గత నెలలో ఉద్యోగ విరమణ చేశారు.

### ఎస్పీ గ్రీవెన్స్ రద్దు

శ్రీకాకుళం క్రైమ్/కాశీబుగ్గ : కాశీబుగ్గలో శుక్రవారం నిర్వహించాల్సిన ఎస్పీ గ్రీవెన్స్‌ను రద్దు చేస్తున్నట్లు ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దుర్గాష్టమి సందర్భంగా వినతులు స్వీకరించడం లేదని, ప్రజలు గమనించాలని కోరారు.

### 16లోగా భూముల వివరాలు చెప్పండి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వ శాఖలకు కేటాయించిన భూముల వివరాలు ఈ నెల 16లోగా తెలియజేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తహసీల్దార్లను ఆదేశించారు. జిల్లా స్థాయి ల్యాండ్ ఎలియనేషన్స్ మానిటరింగ్ కమిటీతో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 3161.55 ఎకరాల భూమి ఎలియనేషన్‌కు పంపినట్లు చెప్పారు. సమావేశంలో డీఆర్‌ఓ ఎం.అప్పారావు, శ్రీకాకుళం ఆర్డీఓ కె.సాయి ప్రత్యూష, ఉప కలెక్టర్ సుదర్శన్ దొర, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ జాన్ సుధాకర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డుల శాఖ సహాయ సంచాలకుడు విజయ్‌కుమార్, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరావు, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ బి.శాంతిశ్రీ, కలెక్టరేట్ ఈ-సెక్షన్ పర్యవేక్షకులు పి.సరోజని తదితరులు పాల్గొన్నారు.

### సెలవులో కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వ్యక్తిగత పనులపై గురువారం నాలుగు రోజుల పాటు సెలవు పెట్టారు. 14న తిరిగి విధుల్లోకి రానున్నారు. అప్పటి వరకు ఇన్‌చార్జి కలెక్టర్‌గా జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ వ్యవహరించనున్నారు.

### నేటితో ముగియనున్న 'మద్యం' దరఖాస్తుల గడువు

శ్రీకాకుళం క్రైమ్ : 'మద్యం' దరఖాస్తుల స్వీకరణ గడువు శుక్రవారంతో ముగియనుంది. గురువారం రాత్రి నాటికి జిల్లావ్యాప్తంగా 3427 దరఖాస్తులు అందినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా డిప్యూటీ కమిషనర్ దోసకాయల శ్రీకాంతరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీకాకుళం 825(32 షాపులు), ఆమదాలవలసలో 268(13), రణస్థలంలో 502(15), పొందూరులో 281(10), నరసన్నపేటలో 193(12), కొత్తూరులో 178(7), పాతపట్నం 177(8), టెక్కలిలో 184(11), కోటబొమ్మాళిలో 224(15), పలాసలో 154(15), సోంపేటలో 233(12), ఇచ్ఛాపురం 208(8) దరఖాస్తులు వచ్చాయని వివరించారు.

# అంతా ఇష్టారాజ్యం

గార డీసిల్టేషన్ పాయింట్ వల్ల భవిష్యత్‌లో కోతకు గురయ్యే అవకాశం ఉన్న రక్షణ గోడ ఇది. 2012–13లో సుమారు రూ. 4 కోట్ల నిర్మాణంతో రెండు పార్టులుగా ఈ రక్షణ గోడను రోడ్లు భవనాల శాఖ నిర్మించింది. వంశధార వరదల సమయంలో సీఎస్పీ రోడ్డు కోతకు గురవ్వడంతో పాటు పొలాలు, ఆరంగిపేట, వమరవల్లి వంటి ప్రాంతాలకు వెళ్లకుండా గోడ నిర్మించారు. ఇప్పుడీ తవ్వకాలతో రక్షణ గోడకు ముప్పు వాటిల్లనుంది. వాస్తవంగా పోలాకి మండలం వైపు ఇసుక మేటలున్నా, దాన్ని తీయకుండా రక్షణగోడ సమీపంలోనే తవ్వకాలతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీనికి చుట్టు పక్కల 20 వరకు వ్యవసాయ పంపుసెట్లు ఉన్నాయి. వాటికి కూడా ప్రమాదమే.



ఉల్లంఘనలివిగో..



తవ్వకాల సమీపంలో రోజువారి 32 గ్రామాలకు తాగునీరు అందించే ఇన్‌ఫిల్టరేషన్ బావి ఇది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మత్స్యకార ప్రాంతాలకు తాగునీటి అవసరాలు తీర్చేందుకు నిర్మించారు. రోజుకు 4 లక్షల లీటర్లు నీరు అందించే పథకమిది. ఈ ఫిల్టరేషన్ బావికి 500 మీటర్లు వరకు ఎటువంటి తవ్వకాలు చేపట్టకూడదన్న నిబంధనలున్నా సమీపంలోనే ఇసుక తవ్వేస్తున్నారు. భవిష్యత్‌లో ఇన్‌ఫిల్టరేషన్ బావికి నష్టం తప్పదు.



బూర్జ మండలం నారాయణపురం పరిధిలోని నాగావళిలో నడుస్తున్న డీసిల్టేషన్ పాయింట్ ఇది. ఇక్కడంతా అడ్డగోలు వ్యవహారమే. ఇరిగేషన్, మైనింగ్, రెవెన్యూ పర్యవేక్షణలో జరగాల్సిన తవ్వకాలు ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఆయన నిబంధనలకు విరుద్ధంగా ప్రొక్లెయినర్లు పెట్టి ఇసుక తవ్విస్తున్నారు. ఒక రశీదుపై నాలుగైదు లారీల ఇసుక తరలిస్తున్నారు. కొన్నింటికి ఒడిశా రాష్ట్రానికి చెందిన రశీదులు ఇస్తున్నారు. చలానా కంటే అదనంగా లోడింగ్ చేస్తున్నారు. నదిలోని డీసిల్టేషన్ పాయింట్‌కు లారీలను అనుమతించినందుకు రూ.14వేలకు పైగా ప్రైవేటు వ్యక్తులు తీసుకుంటున్నారు. ఈ సొమ్మంతా నియోజకవర్గ కీలక నేతకు అందుతోందన్న ఆరోపణలు ఉన్నాయి.

గార నుంచి కళింగపట్నం వెళ్లే దారిలో వంశధార నదిలో నడుస్తున్న డీసిల్టేషన్ పాయింట్ ఇది. ఇక్కడ కూడా నిబంధనల ఉల్లంఘనే. పడవల సాయంతో డ్రెడ్జింగ్ చేసి ఇసుక తీస్తున్నారు. ఇంజిన్ సాయంతో పైపుల ద్వారా ఇసుక ఒడ్డుకు చేరుస్తున్నారు. నది పక్కనే స్టాక్ చేసిన ఇసుకను జేసీబీలతో లోడింగ్ చేస్తున్నారు. దీనికి లెక్కా పత్రం లేదు. అక్కడ వేయింగ్ మిషన్ లేదు. ఎంత వేస్తున్నారో ఎవరికీ తెలియదు. నచ్చినంత వేస్తున్నందున ఒక్కొక్క లారీకి రూ.10వేలకు పైగా అదనంగా వసూలు చేస్తున్నారు. ఇదంతా ప్రైవేటు వ్యక్తుల జేబుల్లోకి వెళ్తోంది. నియోజకవర్గ కీలక నేత పేరు చెప్పి బయట వ్యక్తులు దోచేస్తున్నారు.



అక్రమాలు ఇలా..

- ఇసుక డీసిల్టేషన్ పాయింట్లలో ఘోరాలు
- నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు
- రక్షణ గోడ, మంచినీటి బావులకు ముప్పు
- కాంట్రాక్టర్ల ముసుగులో చెలరేగిపోతున్న అక్రమార్కులు
- ఒక్కో లారీపై చలానాకు అదనంగా రూ.10 వేల నుంచి రూ.15 వేలు వసూలు



గార సమీపంలోని వంశధార నదిలో ఇసుకను తవ్వి అడ్డంగా గట్టు వేస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జిల్లాలోని గార, నారాయణపురంలో నిర్వహిస్తున్న డీసిల్టేషన్ పాయింట్లు అక్రమాలకు అడ్డాగా మారుతున్నాయి. నదిలో వరదలతో ఏర్పడే మేటలను తొలగించి, ఆ ఇసుకను వినియోగదారుల అవసరాలకు విక్రయించాలన్నది డీసిల్టేషన్ పాయింట్ల ఉద్దేశం. ఇదంతా ఇరిగేషన్, మైనింగ్, రెవెన్యూ పర్యవేక్షణలో జరగాలి. ఇందుకు విరుద్ధంగా ఇక్కడ వ్యవహారం నడుస్తోంది. ఇసుక మేటలను మేన్యువల్‌గా తొలగించకుండా భారీ యంత్రాల సాయంతో తవ్వి తీస్తున్నారు. తొలగించిన ఇసుకను ఒక చోట డంప్ చేసి, అక్కడి నుంచి విక్రయించాలి. స్టాక్ పాయింట్ నుంచే లారీలకు లోడింగ్ చేసి పంపించాలి. అందుకు భిన్నంగా తవ్విన ఇసుకను నదిలోనే లారీల్లో లోడింగ్ చేసి విక్రయిస్తున్నారు. ఇదంతా ఒక ఎత్తు అయితే టన్నుకి రూ.340చొప్పున ప్రభుత్వం ధర నిర్ణయించగా, అక్కడ పెత్తనం చేస్తున్న తెలుగు తమ్ముళ్లు లారీకి అదనంగా రూ.10వేల నుంచి రూ. 15వేలు వసూలు చేస్తున్నారు. అదనంగా వసూలు చేసిన సొమ్ము నియోజకవర్గ కీలక ప్రజాప్రతినిధుల కోసమని వసూలు చేస్తున్న వ్యక్తులు చెబుతున్నారు. ఇదంతా పబ్లిక్‌గానే జరుగుతోంది. ఇక్కడ రోజుకు రూ.లక్షల్లో అక్రమ వ్యాపారం సాగుతోంది.

### నిబంధనలకు విరుద్ధంగా..



డీసిల్టేషన్ పాయింట్లను ప్రభుత్వమే నడపాలి. ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో ఎక్కడ, ఎంత ఇసుక తీయాలి అనేది సూచించాలి. అక్కడే తవ్వకాలు జరపాలి. ఇదంతా మేన్యువల్‌గా జరగాలి.

- తవ్విన ఇసుకను స్టాక్ పాయింట్‌కు వచ్చాక సేకరించిన ఇసుక ఎన్ని టన్నులుందో మైనింగ్ శాఖ లెక్కపెట్టి గుర్తించాలి. తవ్వకాలకు, అమ్మకాలకు తేడాను గమనించాలి. రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో స్టాక్ పాయింట్‌ల వద్ద లోడింగ్ జరగాలి.
- కానీ, ఇక్కడ ఆ శాఖలు తమకేమి సంబంధం లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నాయి. దీనికంతటికీ రాజకీయ ఒత్తిళ్లే కారణం.
- డీసిల్టేషన్ పాయింట్ నిర్వహణ కాంట్రాక్ట్‌ను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు.
- ఎవరికి అప్పగించారో అన్నదానిపై స్పష్టత ఇవ్వడం లేదు. కానీ, విజయవాడకు చెందిన వ్యక్తులమని చెప్పి డీసిల్టేషన్ పాయింట్ల వద్ద కొనసాగుతున్నారు.
- వీరితో స్థానిక తెలుగు తమ్ముళ్లు కలిసి మొత్తం కథ నడిపేస్తున్నారు.

### పొంచి ఉన్న ముప్పు..

డీసిల్టేషన్ పాయింట్ల వద్ద తవ్వకాలతో పరిసర గ్రామాలకు ముప్పు తప్పని పరిస్థితి నెలకొంది. నదీ రక్షణ గోడ, తాగునీటిని అందించే ఇన్‌ఫిల్టరేషన్ బావుల సమీపంలో ఇష్టారీతిన వాల్టా చట్టాన్ని అతిక్రమించి తవ్వకాలు జరుపుతున్నారు. గార డీసిల్టేషన్ పాయింట్ వద్ద ఇన్‌ఫిల్టరేషన్ బావి దెబ్బతినడంతో పాటు రక్షణ గోడ కొట్టుకుపోయే అవకాశం ఉంది. ఇదంతా ఒక ఎత్తు అయితే నదిలో అడ్డంగా ఇసుక గట్టులు వేసి నదీ గమనాన్నే మార్చేస్తున్నారు. దీంతో వరదలొస్తే పక్కనున్న గ్రామాల ముంపు తప్పదు.

## నవరాత్రి స్పెషల్


### లక్షణమైన అలంకరణ



అవలింగి గ్రామంలోని నీలమణి అమ్మవారిని గురువారం రూ.2 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు. శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

– సారవకోట

### ఆభరణాల అలంకరణ సేవ



కవిటిలోని చింతామణి అమ్మవారికి గురువారం ఆభరణాల అలంకార సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

– కవిటి

### దుర్గాదేవిగా విజయదుర్గ



జిల్లా కేంద్రంలోని నానుబాల వీధిలో విజయదుర్గా ఆలయంలో అమ్మవారిని దుర్గాష్టమిని పురస్కరించుకుని గురువారం దుర్గాదేవిగా అలంకరించారు. అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణశర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. – శ్రీకాకుళం కల్చరల్

# 9 వేల ట్యాపులు కొట్టేశారు

- ఏడుగురు నిందితులు అరెస్టు
- రూ. 9 లక్షల విలువైన ట్యాపులు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇత్తడి ట్యాపులు

శ్రీకాకుళం క్రైమ్ : కాదేదీ చోరీకి అనర్హం కాదన్నది వారి అభిమతమేమో.. సర్కారీ సొత్తును సైతం వదల్లేదు. కుళాయి పైపులకు వినియోగించే ఇత్తడి ట్యాపులను దొంగిలించి చివరకు పోలీసులకు పట్టుబడ్డారు. జిల్లాలోని కోటబొమ్మాళి పీఎస్ పరిధిలోని పాకివలస రోడ్డు పక్కన ఓ షాపులో భద్రపరిచిన రూ. 9 లక్షల విలువ చేసే జలజీవన్ మిషన్‌కు సంబంధించిన తొమ్మిది వేల ఇత్తడి వాటర్ ట్యాపులు గత నెల 30న అర్ధరాత్రి చోరీకి గురయ్యాయి. ఈ కేసును పోలీసులు ఛేదించడంతో గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి మీడియాకు వివరాలు వెల్లడించారు.

**పనుల కోసం వచ్చి..**

నందిగాం, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, పోలాకి మండలాల్లోని 28 గ్రామాలకు జలజీవన్ మిషన్ పథకం కింద ఏర్పాటు చేసేందుకు ఎన్‌ఏఆర్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఇత్తడి వాటర్ ట్యాపులను పాకివలస సర్వీసు రోడ్డులోని ఓ అద్దె షాపులో ఉంచింది. ఈ నెల 5న షాపు వద్దకు కంపెనీ ప్రాజెక్టు ఇన్‌చార్జి మావులూరు వెంకటరెడ్డి వెళ్లి చూడగా షట్టర్ తెరిచివుండటం గమనించారు. లోపల 25 మూటల్లో ఉన్న తొమ్మిదివేల ట్యాపులు (ఒక్కో ట్యాపు ధర రూ. 100) చోరీకి గురయ్యాయని గుర్తించి వెంటనే కోటబొమ్మాళి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జిల్లా అదనపు ఎస్పీ (క్రైమ్), కాశీబుగ్గ ఇన్‌చార్జి డీఎస్పీ పి.శ్రీనివాసరావు పర్యవేక్షణలోని టెక్కలి రూరల్ సీఐ శ్రీనివాస్ విచారణ జరిపారు. తెలంగాణ రాష్ట్రం హన్మకొండకు చెందిన కంది సంపత్, బొందాని రమేష్, చింతల మహేష్, పల్లపు యాదగిరిలు అదే ఎన్‌ఏఆర్ ఇన్‌ఫ్రా కంపెనీలో కూలీలు. జలజీవన్ పనులు చేసేందుకు వచ్చి చీపుర్లపాడులో అద్దెకు ఉండేవారు. పాకివలసలో అద్దె గదిలో ట్యాపులు భద్రపర్చిన విషయం తెలియడంతో మూడు నెలల ముందే చోరీకి పథక రచన చేశారు. గత నెల 30వ తేదీ రాత్రి దొంగిలించారు. సత్రాపు సింహాచలంకు చెందిన స్క్రాప్ షాపులో అమ్మేందుకు కోటబొమ్మాళి మండలం వరహాలమ్మపేటకు చెందిన చెన్నంశెట్టి అప్పన్నకు సాయం అడిగారు. ఆయన సదునుపల్లి రాము అనే వ్యక్తి వాహనం బుక్ చేశారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

### పట్టుబడ్డారిలా..

స్క్రాప్ షాపు ఓనరు వద్ద దాచేందుకు, అతనికి కొంత వాటా ఇచ్చేందుకు మాట్లాడుకుని అక్కడి నుంచి గురువారం విశాఖపట్నం తరలించడానికి ప్రణాళిక వేసుకున్నారు. ఈ క్రమంలో లగేజీ వ్యానుపై వస్తుండగా కోటబొమ్మాళి మండలం జర్జంగి జాతీయ రహదారి పై ఓవర్ బ్రిడ్జి వద్ద సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సత్యనారాయణలు మాటు వేసి పట్టుకున్నారు. కేసు తక్కువ కాలంలోనే ఛేదించిన ఏఎస్పీ శ్రీనివాసరావు, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది మాధవరావు, లోకనాథం, ఉమామహేశ్వరరావులను ఎస్పీ అభినందించారు.

# వంద రోజుల్లోనే బయటపడిన బాబు డాబు

- కూటమిని గెలిపించి తప్పు చేశామన్న పశ్చాత్తాపం ప్రజల్లో కనిపిస్తోంది
- ప్రమాణ స్వీకార సభలో వైఎస్సార్ సీపీ నాయకుల ధ్వజం



సభకు హాజరైన కార్యకర్తలు,నాయకులు



ధర్మాన కృష్ణదాస్‌తో ప్రమాణం చేయిస్తున్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు

నరసన్నపేట : 'కూటమి పాలన డాబు వంద రోజుల్లోనే ప్రజలకు అర్థమైంది. అయ్యో.. మనకు మంచి చేసిన జగనన్నను ఓడించామే.. కూటమి మాయమాటలకు మోసపోయామే అని గ్రామాల్లో ప్రజలు పశ్చాత్తాప పడుతున్నారు. ప్రతి నెలా ఏదో ఒక పథకంతో ఆదుకున్న జగనన్నను కాదని అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు అన్ని పథకాలకు గోవిందనామాలు పెడుతున్నారు' అని వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ నాయకులు ధ్వజమెత్తారు. నరసన్నపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడిగా, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం పార్లమెంటరీ పార్టీ పరిశీలకుడిగా, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు రాష్ట్ర డాక్టర్ల విభాగం అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. పార్టీ నియమావళి ప్రకారం ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో కూటమి వంద రోజుల పాలనను ఎండగట్టారు. జగనన్న పాలన ఐదేళ్లు స్వర్ణయుగంగా కొనసాగిందని గుర్తు చేశారు. పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, నియోజకవర్గాల సమన్వయకర్తలు గొర్లె కిరణ్‌కుమార్, రెడ్డి శాంతి, పేరాడ తిలక్‌లు మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. కార్యక్రమంలో పలాస మున్సిపల్ చైర్మన్ బల్లా గిరిబాబు, పార్టీ నాయకులు అంధవరపు సూరిబాబు, ఎం.పద్మావతి, మామిడి శ్రీకాంత్, స్వరూప్, చిరంజీవ్ నాగ్, దంపల రామారావు, ఎన్ని ధనుంజయరావు, నరసన్నపేట నియోజకవర్గానికి చెందిన ఎంపీపీలు ఆరంగి మురళి, వాన గోపి, జెడ్పీటీసీ చింతు అన్నపూర్ణ, పార్టీ నాయకులు చింతు రామారావు, బైరాగినాయుడు, గుప్త ,అప్పన్న పాల్గొన్నారు.

### ప్రజల్లో ఆదరణ తగ్గలేదు..



వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఆదరణ తగ్గలేదు.పార్టీకి జిల్లాలో పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు అందరూ సహకరించాలి. సమన్వయంతో పనిచేయాలి. భవిష్యత్తులో పార్టీ కార్యకర్తలకు తప్పక మంచి జరుగుతుంది.జిల్లా నాయకత్వం కార్యకర్తలకు అండగా ఉంటుంది.

– ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

### పథకాలకు నామాలు..



జగనన్న పాలనలో అన్ని వర్గాలకు పథకాలు అందేవి. కూటమి ప్రభుత్వం రాగానే వాటికి గోవింద నామాలు పెట్టారు. ధరలు దారుణంగా పెరుగుతున్నాయని ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఉల్లిపాయలు కోస్తే కళ్లల్లో నీళ్లు వచ్చేవి. కూటమి పాలనలో ఉల్లి కొంటేనే కళ్లల్లో నీళ్లు వస్తున్నాయి. వంద రోజుల్లో రూ. 30 వేల కోట్లు అప్పులు చేశారు.

– తమ్మినేని సీతారాం, పార్లమెంటరీ పార్టీ పరిశీలకుడు

### ప్రజల్లో పశ్చాతాపం



కూటమి పాలన ఎలా ఉంటుందో వంద రోజుల్లోనే ప్రజలకు అర్థమైంది. వారిలో పశ్చాతాపం కనిపిస్తోంది. ప్రభుత్వ వైఫల్యం కారణంగా మూలపేట పోర్టు పనులు ఆగిపోయాయి. కూటమి నాయకులు రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తే.. మేం గుడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తాం.

– సీదిరి అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు

## క్లుప్తంగా

### ప్రపంచ కళా జాతరకు 'ఆలి తిప్పలు' నాటిక

టెక్కలి: ప్రపంచ తెలుగు సాహితీ కళా జాతరకు టెక్కలి ప్రజా చైతన్య కళా సమితికి చెందిన 'ఆలి తిప్పలు' నాటిక ఎంపికైనట్లు దర్శకుడు డీఏ.స్టాలిన్ గురువారం తెలిపారు. ఈ మేరకు ఐఎస్ఓ గుర్తింపు పొందిన శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ సమితి నుంచి ఆహ్వానం అందినట్లు పేర్కొన్నారు. ఈ నెల 19న తాడేపల్లిగూడేంలో ఈ నాటిక ప్రదర్శిస్తామని పేర్కొన్నారు. నటులు మూల తాతయ్య, జానపద కళాకారుడు కుమార్ నాయక్, నటులు వేదవ్యాస్, తదితరులు నాటిక ప్రదర్శిస్తారని తెలిపారు.

### జిల్లా ఏపీఎస్పీ అడిషనల్ కమాండెంట్‌గా సత్తిబాబు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా ఏపీఎస్పీ అడిషనల్ కమాండెంట్ (ఫస్ట్ బెటాలియన్)గా పి.సత్తిబాబును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ప్రస్తుతం ఇంటిలిజెన్సు విభాగంలో అడిషనల్ కమాండెంట్‌గా ఉన్నారు.

### ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనం చెల్లింపు

ఎచ్చెర్ల క్యాంపస్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న 34 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు రెండు నెలల వేతనాన్ని వర్సిటీ అధికారులు గురువారం చెల్లించారు. ఈఎస్ఐ, పీఎఫ్, జీఎస్టీ, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ కమిషన్ పోగా, రెండు శ్లాబుల్లో ఉద్యోగులకు రూ.16461, రూ.13000 చొప్పున చెల్లించారు. జనవరి 1న వీరు విధుల్లో చేరగా ఇంత వరకు వేతనం అందజేయలేదు. ఇటీవల లేబర్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో మొదటి విడతగా రెండు నెలల వేతనం చెల్లించారు. ఈ నెల 19న లేబర్ కమిషనర్ కార్యాలయంలో విచారణ ఉంది. ఆలోగా పూర్తిస్థాయి వేతనం చెల్లిస్తారా? లేదా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

### పాతపట్నంలో ట్రాఫిక్ ఆంక్షలు




ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ రామారావు

పాతపట్నం: పాతపట్నం నీలమణిదుర్గ ఆలయం వద్ద దసరా పండగ నేపథ్యంలో ప్రత్యేక ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు సీఐ ఎన్.రామారావు తెలిపారు. పాతపట్నం, మెళియాపుట్టి పోలీసులతో పాటు రిజర్వు పోలీసులతో శని, ఆదివారం బందోబస్తు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ మేరకు ప్రత్యేక ఏర్పాట్లపై గురువారం ఆలయ ఈవో వాసుదేవరావుతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ క్యూలైన్‌లో అమ్మవారిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేశామని, వాహన పూజలు ఆలయం ముందు చేసుకోవాలని చెప్పారు.

### 'కూల్'గా గొలుసు చోరీ

కాశీబుగ్గ: మందస మండలం మకరజోల గ్రామంలో గురువారం వడ్డి దమయంతి అనే చిరువ్యాపారి దుకాణంలో గొలుసు చోరీ జరిగింది. ఓ దుండగుడు కూల్ డ్రింక్ కావాలని అడిగి ఒక్కసారిగా దమయంతిని నెట్టేశాడు. ఆమె ధరించిన రెండు తులాల బంగారు గొలుసును తెంచుకుని పారిపోయాడు. బాధితురాలు తేరుకుని కేకలు వేసినా ఫలితం లేకపోయింది. అనంతరం బాధితురాలు మందస పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ ఖాదర్ బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### వనవిష్ణుపురం హత్య కేసులో ముగ్గురు అరెస్టు



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

నరసన్నపేట: పోలాకి మండలం వనవిష్ణుపురంలో మంగళవారం జరిగిన హత్య కేసుకు సంబంధించి ముగ్గురిని గురువారం అరెస్టు చేశామని నరసన్నపేట సీఐ కె.శ్రీనివాసరావు, ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. వీరాస్వామి హత్య కేసులో ఏ–1 పాలిన కృష్ణమూర్తి, ఏ–4 తలగాన పిల్లయ్య, ఏ–5 తలగాన దుర్గారావులను అరెస్టు చేశామని, మరో 9 మందిని అరెస్టు చేయాల్సి ఉందని చెప్పారు. వీరి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని, గ్రామంలో పోలీసు పికెట్ కొనసాగుతుందని తెలిపారు. ప్రతిఒక్కరూ శాంతియుతంగా ఉండాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు.

### డ్రైనేజీలో గుర్తు తెలియని మృతదేహం



మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్సు సమీపంలోని ఓ డ్రైనేజీలో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. శరీరంపై గాయాలుండటంతో మద్యం సేవించి డ్రైనేజీలో పడిపోయి ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. రెండో పట్టణ పోలీసులు విచారణ చేపడుతున్నారు.

# వసతి గృహాల బిల్లులకు.. మోక్షమెప్పుడో?



- రూ.5.49 కోట్ల మేర బకాయిలు
- వార్డెన్లకు తప్పని వడ్డింపు కష్టాలు
- విద్యార్థులను పట్టించుకోని కూటమి ప్రభుత్వం

శ్రీకాకుళం పాతబస్టాండ్:

జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో విద్యార్థుల ఆకలి తీర్చేందుకు వార్డెన్లు అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. కొన్ని నెలలుగా బిల్లులు అందకపోవడంతో వసతి గృహ సంక్షేమాధికారులపై అప్పుల భారం పెరుగుతోంది. దీనికి తోడు కూరగాయల ధరల పెరుగుదల భోజనంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఫలితంగా హాస్టల్లో వడ్డించే భోజనం విద్యార్థులకు మింగుడుపడటం లేదు. ఈ విషయమై తల్లిదండ్రులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బిల్లులు మంజూరు చేయాలని వార్డెన్లు నెలల తరబడి వేడుకుంటున్నా కూటమి ప్రభుత్వం కనికరించడం లేదు.

### ఇదీ పరిస్థితి..

జిల్లాలో సంక్షేమ హాస్టళ్లలో బీసీ, సాంఘిక సంక్షేమ వసతి గృహాలు ఎక్కువగా ఉన్నాయి. వీటిలో ప్రీమెట్రిక్, పోస్టుమెట్రిక్ వసతి గృహాలు 98 ఉన్నాయి. అందులో సుమారు 8861 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి ప్రత్యేక మెనూ ప్రకారం భోజనం అందజేయాల్సి ఉంది. సివిల్ సప్లయ్ శాఖ నుంచి రేషన్ బియ్యం వసతి గృహాలకు సరఫరా అవుతుంది. ఇందుకోసం ప్రభుత్వం సివిల్ సప్లయ్ శాఖకు కిలోకు రూ.1 చొప్పున చెల్లిస్తుంది. నెలవారీగా కిరాణా సరుకులు కాంట్రాక్టు తీసుకున్న వారి నుంచి సరఫరా అవుతాయి. వారి నుంచి నెలకు సరిపడా 18 రకాల సరుకులు నేరుగా వసతి గృహాలకు చేరుతాయి. పాలు, గుడ్లు, కూరగాయలు, చికెన్, వంటగ్యాస్ తదితరాలను విద్యార్థుల మెనూ చార్జీలతో నడిపిస్తుంటారు. ఈ చార్జీలను ఆయా వసతిగృహాల వార్డెన్లు భరిస్తుంటారు. అయితే మెనూ బిల్లులు సకాలంలో అందక భోజనంలో నాణ్యత కొరవడుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. వీటితో పాటు గిరిజన సంక్షేమ వసతి గృహాలు, ఏపీ సాంఘిక సంక్షేమ గురుకులాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

**మెనూ చార్జీలు ఇలా..**

సాధారణ వసతిగృహంలో ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం రోజుకు రూ.46, కళాశాల వసతి గృహాల్లో ఒకొక్కరికి రూ.53 చొప్పున చెల్లించాల్సి ఉంది. ఈ లెక్కన నెలకు సాధారణ వసతి గృహంలో ఒక్కో విద్యార్థికి రూ.1400, కాలేజీ విద్యార్థికి రూ.1,600 చెల్లించాలి. వారానికి ఆరు కోడిగుడ్లు, ప్రతి ఆదివారం బిరియానీ, అరటిపండ్లు, పాలు, కూరగాయలతో కూడిన ఆహారం అందించాలి. బిల్లుల చెల్లింపులో జాప్యంతోసరైన భోజనం అందించలేకపోతున్నామని వార్డెన్లు చెబుతున్నారు.

| విభాగం | ప్రీమెట్రిక్ హాస్టళ్లు | పోస్టుమెట్రిక్ | విద్యార్థులు | బకాయి |
| --- | --- | --- | --- | --- |
| బీసీ సంక్షేమం | 63 | 18 | 6492 | రూ.3.85 కోట్లు |
| సాంఘిక సంక్షేమం | 11 | 6 | 2369 | రూ.1.64 కోట్లు |

### కానరాని నిర్వహణ నిధులు..

వసతి గృహ నిర్వహణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం లేదు. దీంతో విద్యుత్ బల్బులు, మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణ, కిటికీలు, తలుపుల మరమ్మతులకు వార్డెన్లు సొంత బడ్బులు చెల్లిస్తున్నారు. హాస్టల్ నిర్వహణకు ప్రతి నెలా కనీసం రూ.3 వేలు నుంచి రూ.5 వేలు వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది.

### కూరగాయల ధరల ప్రభావం..

కొన్నాళ్లుగా కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. ఉల్లి, అల్లం, మిరప, నూనె ధరలు విపరీతంగా పెరిగాయి. తెల్లఉల్లి కిలో రూ.340 నుంచి రూ.400 వరకు, అల్లం కిలో రూ.320, ఉల్లి కిలో రూ.60 ధరలు పలుకుతున్నాయి. దీంతో విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనం అందడం లేదు. ఇచ్చే మెనూ చార్జీలకు, పెరిగిన కూరగాయల ధరలకు పొంతన లేదని, ఇలాగైతే నిర్వహణ కష్టమని వార్డెన్లు వాపోతున్నారు.

**బిల్లులు విడుదల చేయాలి**



ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు బిల్లులు రావాల్సి ఉంది. పెండింగ్ బిల్లులు అందక వార్డెన్లు అప్పులు తెచ్చి భోజనం పెడుతున్నారు. ఫలితంగా వసతి గృహాల్లో మెనూ కూడా సక్రమంగా అమలు కాని పరిస్థితి. ప్రభుత్వం వెంటనే వసతి గృహాల బకాయి బిల్లులు చెల్లించాలి. లేకుండా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమం తప్పదు.

– దివ్వెల చందు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు

# 'పవర్' లేని పండుగలు

- ఈ నెల 14 నుంచి పల్లె పండుగలు
- సర్పంచ్‌ల నిర్ణయాలను పట్టించుకోని వైనం
- ఆచరణకు నోచుకోని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హామీలు



అరసవల్లి: 'స్థానిక సంస్థల అధికారాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గాలికొదిలేసింది. గ్రామ సర్పంచ్‌లకు కనీస విలువ లేకుండా నిధులు లేకుండా గ్రామ పాలనను భ్రష్టు పట్టించారు.. మేం అధికారంలోకి వస్తే.. పార్టీలకతీతంగా గ్రామ స్థాయిలో నిర్ణయాధికారమంతా సర్పంచ్‌లదే..'' ఇవీ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఎన్నికల ముందు చెప్పిన సూక్తులు. ఇప్పుడు ఆయన ఏకంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా, పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా బాధ్యతల్లో ఉన్నా హామీలు మాత్రం అమలు కావడం లేదు. జిల్లాలో పంచాయతీల సర్పంచ్‌లను కాదని కూటమి నేతలనే అందలం ఎక్కించి ఈ నెల 14 నుంచి వారం రోజుల పాటు నిర్వహించనున్న 'పల్లె పండుగ'లను నిర్వహించాలని మౌఖిక ఆదేశాలు జారీ చేశారు.

**రూ.261.59 కోట్లతో 3470 పనులు...**

జిల్లాలో 30 మండలాల్లో 912 గ్రామ పంచాయతీలున్నాయి. పల్లె పండుగల్లో భాగంగా జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం కింద పంచాయతీల్లో పలు మౌలిక సదుపాయాల పనులను చేసేందుకు నిర్ణయించింది. కేంద్రప్రభుత్వ నిధులతో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు గ్రామ పంచాయతీ తీర్మానాల మేరకు పనులు చేయాల్సి ఉంది. దీనిలో భాగంగా రూ.261.59 కోట్ల అంచనా నిధులతో 3470 పనులను చేయించేందుకు గుర్తించారు. ఇందుకోసం ఈ ఏడాది ఆగస్టు 23న రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి 13325 పంచాయతీల్లో గ్రామ సభలు పెట్టి తీర్మానాలను పూర్తిచేశారు. డ్వామాపీడీ, జిల్లా పంచాయతీ అధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ ఎస్ఈ తదితర అధికారులంతా కమిటీ సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటి పర్యవేక్షణామోదంతో మొత్తం 3470 పనులను చేపట్టనున్నారు. అయితే ఇంతవరకు 2714 పనుల ప్రతిపాదనలకు మాత్రమే అనుమతులిచ్చి అప్‌లోడ్ చేశారు.

**పండుగలకు దూరంగా సర్పంచ్‌లు!**

మంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన మౌఖిక ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం పల్లె పండుగలకు అన్ని ఏర్పాట్లు చేసింది. ముఖ్యంగా పల్లెల్లో పంచాయతీ సర్పంచ్‌లు కీలకంగా వ్యవహరించాల్సిన ఈ పండుగలకు వారే దూరమయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలకు దిగుతోంది. జిల్లాలో అత్యధికంగా వైఎస్సార్‌సీపీ సానుకూల సర్పంచ్‌లే ఉన్న నేపథ్యంలో వీరికి ఏమాత్రం ప్రాధాన్యత లేకుండా పల్లె పండుగలను నిర్వహించాలని సర్కార్ కుట్రలు చేస్తోంది. సర్పంచ్‌లతో పాటు ఎంపీపీలు, జెడ్పీటీసీలు, జెడ్పీ చైర్‌పర్సన్లు కూడా ఈ సర్కార్ హయాంలో అవమానాలు ఎదుర్కోక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు, జనసేన కార్యకర్తల గుర్తింపే టార్గెట్‌గా ఈ పండుగలు నిర్వర్తిస్తున్నట్లుగా తెలుస్తోంది. రెండేళ్ల తర్వాత జరిగే 'స్థానిక' సంస్థల ఎన్నికలకు పునాదిగా ఈ పండుగలను నిర్వర్తించేలా సన్నాహాలు మొదలు కానున్నాయి. క్షేత్రస్థాయిలో జనసేన నేతల గుర్తింపు.. వారి ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల బరిలో నిలబడనున్న నేతల జాబితాను ఇదే వేదికల ద్వారా సిద్ధం చేయనున్నట్లు తెలుస్తోంది.

## జిల్లా స్థాయి కబడ్డీ పోటీల విజేత శ్రీకాకుళం



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని ఉద్దానం రామకృష్ణాపురంలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో శ్రీకాకుళం జట్టు విజేతగా నిలిచింది. నాలుగు రోజులుగా నిర్వహించిన పోటీలు గురువారం ముగియడంతో నిర్వాహకుల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మొత్తం 112 జట్లు పాల్గొనగా ఫైనల్స్‌లో అమలపాడు, శ్రీకాకుళం జట్లు తలపడ్డాయి. ఉత్కంఠ పోరులో విజేతగా నిలిచిన వారికి స్పాన్సర్ లింగూడు సోమేశ్వరరావు రూ.30వేలు నగదు, ట్రోఫీ బహూకరించారు. ద్వితీయ స్థానంలో నిలిచిన అమలపాడుకు రూ.25వేలు, తృతీయ స్థానంలో నిలిచిన కేఆర్ స్టేడియం జట్టుకు రూ.20వేలు, నాలుగో స్థానంలో నిలిచిన గొల్లమాకన్నపల్లి జట్టుకు రూ.15వేలు, 5వ స్థానంలో నిలిచిన శ్రీకాకుళం గల్లీ బాయ్స్ జట్టుకు రూ.8వేలు నగదును స్పాన్సర్లు సత్య బ్రదర్స్, నేను నా క్లాస్‌మేట్స్, యూఆర్‌కేపురం జగదాంబ సెంటర్, పవన్ అండ్ సత్యంగ్రూపు సభ్యులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ చింత హేమారావు, మాజీ సర్పంచ్ చింత నారాయణమూర్తి, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## తైక్వాండో పోటీల్లో శ్రీకాకుళం జోరు



క్రీడాకారులతో కోచ్ లక్ష్మణరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో శ్రీకాకుళం క్రీడాకారులు సత్తాచాటారు. తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదికగా ఈ నెల 4 నుంచి 10 వరకు జరిగిన ఏపీ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ అండర్–14,17,19 బాలబాలికల తైక్వాండో చాంపియన్‌షిప్–2024 పోటీల్లో 12 పతకాలు సాధించి శభాష్ అనిపించారు. ఇందులో నాలుగు బంగారు, మూడు రజత, ఐదు రజత పతకాలు ఉన్నాయి. స్వర్ణ పతకాలు సాధించిన నలుగురు క్రీడాకారులు జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. క్రీడాకారుల బృందానికి శాప్ తైక్వాండో కోచ్ లక్ష్మణరావు శిక్షకుడిగా వ్యవహరించారు. అండర్–14 విభాగంలో ఎం.తిలక్‌రోషన్ స్వర్ణం, బి.వి జయ్‌కుమార్ రజతం, డి.ఉదయ్‌కిరణ్ కాంస్యం, ఎం.దీక్షిత రజతం, వై.యశశ్విని రజతం సాధించారు. అండర్–17 విభాగంలో బి.వేదశ్రీ బంగారం, ఎల్.తేజ కాంస్యం, డి.ద్రాక్షాయణి కాంస్యం, అండర్–19 విభాగంలో ఎస్.రాజకుమార్ స్వర్ణం, ఆర్.వి.ప్రీతమ్ స్వర్ణం, సీహెచ్ నాగు కాంస్యం, డి.మౌళి కాంస్య పతకాలు సాధించారు.

## సమాచార హక్కు చట్టం అమలు చేయాల్సిందే



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ అప్పారావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: సమాచార హక్కు చట్టం కచ్చితంగా అమలు చేయాల్సిందేనని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.అప్పారావు స్పష్టం చేశారు. జిల్లాలో ఆర్టీఐ చట్టం అమలు తీరుపై గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టం అమల్లోకి వచ్చి 19 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లాలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఆర్టీఐ కచ్చితంగా అమలు కావాల్సిందేనన్నారు. భవిష్యత్‌లో అప్పీళ్ల విచారణ వర్చ్యువల్ విధానంలో జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో 4(1)బీ సమాచారం ప్రతి కార్యాలయంలో అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. అనంతరం పౌర సమాచార, అప్పిలేట్ అధికారులు అడిగిన సందేహాలకు జిల్లా కో ఆర్డినేషన్ కమిటీ సభ్యులు కొమ్మాజ్యోష్యుల వసంత్ కుమార్ నివృత్తి చేశారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి జి.ఎ.సూర్య నారాయణ, సీ–సెక్షన్ సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, ఆర్టీఐ కమిటీ సభ్యులు జె.షణ్ముఖరావు పాల్గొన్నారు.

### పద్మశ్రీ చిత్రానికి అవార్డులు

శ్రీకాకుళం కల్చరల్ : ఎస్ఎస్ బ్యానర్‌పై జిల్లాకు చెందిన ఎస్ఎస్ పట్నాయిక్ (సదాశివుని శ్రీను) రచించి, నటించి, దర్శకత్వం వహించిన 'పద్మశ్రీ' చిత్రంలో హీరోయిన్‌గా నటించిన విజయనగరం జిల్లాకు చెందిన రావిపల్లి సంధ్యారాణికి ఇంటర్నేషనల్ ఫిలిమ్ ఫెస్టివల్ ఆఫ్ ఒడిశాలో ఉత్తమ కథానాయికగా అవార్డు లభించిందని ఎంసీఏ వ్యవస్థాపకులు మణిపాత్రుని నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో ఈ చిత్రానికి ఇండియన్ ఫిలిమ్ మేకర్స్ అసోసియేషన్‌లో ఉత్తమ స్క్రీన్‌ప్లే రైటర్‌గా ఎస్ఎస్ పట్నాయిక్‌కు అవార్డు వచ్చిందని పేర్కొన్నారు. త్వరలో వీరికి ఎంసీఏ తరఫున సన్మానిస్తామని చెప్పారు.

### పెండింగ్ కేసులపై దృష్టిపెట్టాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ అర్జీలుపై గురువారం తహసీల్దార్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టు కేసులు ఎక్కడెక్కడ పెండింగ్‌లో ఉన్నాయో తెలుసుకోవాలన్నారు. రణస్థలం మండలంలో రీ సర్వేలో భూమి తక్కువగా వచ్చిందని భూ యజమాని అర్జీ పెట్టుకోగా జేసీ సంబంధిత భూ యజమానితో స్వయంగా ఫోన్లో మాట్లాడి తిరిగి రీ సర్వే చేయించి మీ భూమి మీకు అప్పగిస్తామని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.అప్పారావు, పలాస ఇన్‌చార్జి ఆర్డీఓ సుదర్శన్ దొర, కలెక్టరేట్ ఈ సెక్షన్ పర్యవేక్షకులు పి.సరోజిని తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి మృతితో ఆందోళన



చిన్నారి జశ్వీక (ఫైల్)

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని బొందిలీపురంలో ఏ–1 ఆస్పత్రిలో విషాద ఘటన చోటు చేసుకుంది. చికిత్స పొందుతున్న చిన్నారి మృతి చెందడంతో కుటుంబీకులు, బంధువులు ఆందోళనకు దిగారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని చేపలవీధిలో నివసిస్తున్న టి.శ్రావణ్‌కుమార్, హిమబిందుల ఏడాదిన్నర కుమార్తె జశ్వికకు తరచూ వాంతుల సమస్య ఉండేది. కడుపులో ఏదైనా సమస్య ఉందేమోనని అనుమానమొచ్చి సెప్టెంబరు 17న ఏ–1 ఆస్పత్రిలో చేర్చారు. అక్కడికి వారం రోజుల తర్వాత సిటీస్కాన్, ఎండోస్కోపీ చేశారు. పేగు మడత పడటంతో సర్జరీ అవసరమని, దీనికి రూ.లక్షా80 వేలు కట్టాల్సి ఉంటుందని చెప్పడంతో రూ.లక్షా 66 వేలు కట్టారు. మరుసటి రోజు మరో రూ. 10 వేలు చెల్లించారు. గత నెల 31న వైద్యులు సర్జరీ చేశారు. బుధవారం రాత్రి పాప ఏడవడంతో నర్సులు 0.5 ఎం.జి. మత్తు డ్రగ్ ఇవ్వగా.. అక్కడికి కొద్ది క్షణాల్లోనే కాళ్లు, చేతులు గిలగిలా కొట్టుకోవడంతో కుటుంబీకులు ఆందోళన చెందారు. కాసేపటికి నార్మల్ అయిపోతుందని సిబ్బంది చెప్పడంతో ఆగిపోయారు. గురువారం ఉదయం ఆరు గంటలకు వెళ్లి చూసేసరికి పాప చనిపోవడంతో తల్లిదండ్రులు హిమబిందు, శ్రావణ్‌లు బోరున విలపించారు. ఆస్పత్రి తీరుకు నిరసనగా బంధువులతో కలిసి ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇరువర్గాలు రాజీ కుదుర్చుకోవడంతో పాప మృతదేహాన్ని పట్టుకుని కుటుంబ సభ్యులు వెళ్లిపోయారు. ఈ ఘటనపై ఎటువంటి కేసు నమోదు కాలేదని సీఐ గుండుమోను ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు.

### 25 కేజీల గంజాయితో ఇద్దరు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ చిన్నంనాయుడు, రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు

ఇచ్ఛాపురం: పట్టణ రైల్వేస్టేషన్ సమీపంలో ఎల్‌సీ గేట్ వద్ద 25.060 కేజీల గంజాయితో ఇద్దరు పట్టుబడ్డారని సీఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహారాష్ట్రలోని పల్ఘర్ జిల్లా విరార్ ప్రాంతానికి చెందిన సోమెన్ రఫీక్ షేక్, రాయ్‌ఘర్ జిల్లా పన్‌వేల్ తాలుకా కోన్ గ్రామానికి చెందిన సాగర్‌మహేష్ కదానేలు ఒడిశా రాష్ట్రం మోహన గ్రామంలో గంజాయి కొనుగోలు చేసి ముంబై వెళ్తుండగా ఎల్‌సీ గేట్ సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొన్నారు. నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



### • జైజై భవానీ..



అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లే అంటూ భవానీ దీక్ష మాలధారులు కణకణలాడే నిప్పుల కొలిమిలో నడుస్తూ దుర్గాదేవిపై భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. లొద్దపుట్టి నూకాలమ్మపేటలో నిర్వహిస్తున్న శరన్నవాత్రి ఉత్సవాలు సందర్భంగా గురువారం వేకువజామున స్వాములంతా 'జై భవానీ' నామస్మరణతో నిప్పులపై నడిచారు.

– ఇచ్ఛాపురం రూరల్

### • పల్లెల్లో పత్రి పండగ



దుర్గాష్టమి సందర్భంగా గురువారం నందిగాం, పెంటూరు, నరేంద్రపురం, కణితూరు, పెద్దతామరాపల్లి, నౌగాం తదితర గ్రామాల్లో పత్రి పండగ నిర్వహించారు. ఉదయం మహిళలంతా ముర్రాటలతో వెళ్లి గ్రామదేవతలకు చల్లదనం చేయగా.. సాయంత్రం రైతులు పత్రి కొమ్మలతో ఊరేగింపుగా వెళ్లి పూజలు నిర్వహించి మొక్కు చెల్లించిన కొమ్మలను పొలాల్లో వేశారు. ఇలా చేస్తే పంటలు బాగా పండుతాయని రైతుల నమ్మకం.

– నందిగాం